# పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక

## సుదీర్ఘకాలం తర్వాత కలిశారు .. మధుర స్మృతులు పంచుకున్నారు



అనకాపల్లి, అక్టోబర్ 25, ప్రభాత వార్త :

సుమారు 36 ఏళ్ల క్రితం వర్తక సంఘం అనుబంధ ఏ ఎం ఏ ఏ హైస్కూల్లో పదో తరగతి చదివిన విద్యార్థులు పట్టణంలోని ఒక హోటల్లో ఆదివారం కలుసుకున్నారు. 1989–1990 సం వత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థిని విద్యార్థులు సమాగమం పేరిట పూరపు విద్యార్థుల బ్యాచ్ కు నామకరణం చేశారు. 11 ఏళ్ల క్రితం 25 వార్షికోత్సవ వేడుకలను జరుపుకున్నారు. మరలా ప్రస్తుతం 36వ వార్షికోత్సవ వేడుకలను పట్నంలోని తాకాసి ఎన్క్లేవ్‌లో ఆదివారం కలుసుకున్నారు. 25 వార్షికోత్సవ వేడుకల ఫోటోలను, వీడియోలను ఈ కార్యక్రమంలో పాల్గొనే పూర్వ విద్యార్థులంతా చాలా ఆసక్తిగా తిలకించారు. అప్పటి మధురస్మృతులను పంచుకున్నారు (తరువాయి 8వ పేజీలో)

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
26
వార్త
సోమవారం 26, అక్టోబరు 2026


# దక్షిణంలో కూటమి కీచులాటలు..!

## టీడీపీపై జనసేన, బీజేపీ అభ్యర్థుల గుర్రు

### 16 వార్డుల్లో గెలుపు వ్యూహాలకు సమన్వయ లోపం గండం!



(ప్రభాతవార్త–విశాఖపట్నం)

జీవీఎంసీ ఎన్నికల వేళ విశాఖ దక్షిణ నియోజక వర్గంలో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతోంది. అధికారాన్ని పంచుకుంటున్న భాగస్వామ్య పక్షాలు ఎన్నికల బరిలో మాత్రం ఆశించిన స్థాయిలో కలిసి సాగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా తెలుగుదేశం పార్టీ నాయకులు తమకు సహకరించడం లేదంటూ జనసేన, బీజేపీ అభ్యర్థులు ఆరోపిస్తున్నట్లు సమాచారం. దీంతో ప్రత్యర్థులను ఎదుర్కోవాల్సిన సమయంలో కూటమి పార్టీల మధ్యే అసంతృప్తి నెలకొనడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**16 వార్డులు.. మూడు పార్టీల పోటీ!**

విశాఖ దక్షిణ నియోజకవర్గ పరిధిలోని 16 వార్డుల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల పంపకాలు పూర్తయ్యాయి. ఇందులో జనసేన ఎనిమిది వార్డుల్లో, తెలుగుదేశం పార్టీ ఏడు వార్డుల్లో, బీజేపీ ఒక వార్డులో పోటీ చేస్తున్నాయి. సీట్ల సర్దుబాటు ప్రకారం ఆయా పార్టీల అభ్యర్థులు బరిలో నిలిచినా, క్షేత్రస్థాయిలో మాత్రం సమష్టి కార్యాచరణపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి అభ్యర్థులందరినీ గెలిపించుకోవాల్సిన బాధ్యత మూడు పార్టీల నాయకులు, కార్యకర్తలపై ఉన్నప్పటికీ.. ఆ దిశగా ఆశించిన సహకారం అందడం లేదన్న ఆరోపణలు తెరపైకి వస్తున్నాయి.

**సహకారం ఎక్కడ.. సమన్వయం ఏదీ?**

ఎన్నికల్లో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించడంలో స్థానిక నాయకులు, కార్యకర్తల పాత్ర కీలకం. ఒక పార్టీ అభ్యర్థి పోటీ చేస్తున్న వార్డులో మిగిలిన భాగస్వామ్య పార్టీల శ్రేణులు కూడా ప్రచారంలో పాల్గొని, ఓటర్లను సమీకరిస్తేనే కూటమి ఓట్లు సమర్థంగా అభ్యర్థికి బదిలీ అయ్యే అవకాశం ఉంటుంది. అయితే, దక్షిణ నియోజకవర్గంలో తమకు తెలుగుదేశం పార్టీ నాయకుల నుంచి తగిన సహకారం అందడం లేదని జనసేన, బీజేపీ అభ్యర్థులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిణామం కూటమి పార్టీల మధ్య క్షేత్రస్థాయి సమన్వయంపై ప్రశ్నలు లేవనెత్తుతోంది.

**అంతర్గత విభేదాలు.. ప్రత్యర్థులకు అవకాశమా?**

ఎన్నికల సమయంలో పార్టీల మధ్య సమన్వయ లోపం ప్రత్యర్థులకు అనుకూలంగా మారే ప్రమాదం (తరువాయి 8వ పేజీలో)

## తుపాను హెచ్చరికల నేపథ్యంలో

# అప్రమత్తంగా ఉండాలి

### అధికార యంత్రాంగానికి హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు



అమరావతి, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో సోమవారం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ుధవారం బాపట్ల–విశాఖపట్నం తీరాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అత్యంత అప్రమత్తంగా (తరువాయి 8వ పేజీలో)

## యువత గల్లీ గొడవలు వదిలి

# రాజకీయాల్లోకి రండి

### రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్

**నర్సీపట్నంలో ఘనంగా 'యువతరం మన భవిష్యత్తు' కార్యక్రమం.. 300 మంది యువతతో ఉత్సాహంగా సదస్సు**




నర్సీపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

యువత గల్లీల్లో చిన్నపాటి గొడవలకు వెళ్లి తమ బంగారు భవిష్యత్తును పాడుచేసుకోవద్దని, దానికి బదులుగా రాజకీయాల్లోకి వచ్చి చట్టాలు చేసే స్థాయికి ఎదగాలని రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్ పిలుపునిచ్చారు. నర్సీపట్నం బలిఘట్టం 25వ వార్డు అభ్యర్థి యువ నాయకుడు గవిరెడ్డి లక్ష్మి గణేష్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది యువతతో "యువతరం మన భవిష్యత్తు" కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీ చింతకాయల విజయ్ హాజరయ్యారు. సమావేశంలో (తరువాయి 8వ పేజీలో)

## నర్సీపట్నంలో వైసీపీకి వరుస షాక్‌లు..

# టీడీపీలోకి పోటెత్తిన వలసలు!

**13, 17వ వార్డుల నుంచి పెద్ద ఎత్తున టీడీపీలో చేరిక..**

**పసుపు కండువా కప్పి ఆహ్వానించిన పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్**



నర్సీపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

నర్సీపట్నం మున్సిపాలిటీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వలసల బెడద కొనసాగుతోంది. ప్రతిరోజూ భారీ సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరుతుండటంతో వైసీపీకి వరుస షాక్‌లు తగులుతున్నాయి. తాజాగా మున్సిపాలిటీ పరిధిలోని 13, 17వ వార్డుల నుంచి పెద్ద ఎత్తున కుటుంబాలు టీడీపీ గూటికి చేరాయి. ?13వ వార్డు నుంచి సుమారు 50 కుటుంబాలకు చెందిన 180 మంది, అలాగే 17వ వార్డు నుంచి మరో 15 మంది వైసీపీని వీడి సైకిల్ ఎక్కారు. ఈ భారీ చేరికలలో ప్రధానంగా చిటికల, గొర్లి, తంగేటి, తుంపాల, నాగమల్లి, కశింకోట, గుంటపల్లి, ఈదరాడ, కొయిలాడ, సుర్ల తదితర కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. గత (తరువాయి 8వ పేజీలో)

## 22వవార్డు ఎన్నికల ప్రచారంలో

# వీఎంఆర్‌డీఏ చైర్మన్



విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

తూర్పు నియోజకవర్గం 22వవార్డులో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. ఆదివారం జరిగిన ఎన్నికల ప్రచారంలో కూటమి అభ్యర్థి గొలగాని మంగవేణి తరుపున వీఎంఆర్‌డీఏ చైర్మన్ ఎంవీ ప్రణవ్‌గోపాల్ ప్రచారంలో పాల్గొన్నారు. ఆదివారం ఉదయం నుంచి ఎంవీపీకాలనీ సెక్టారు–6, సెక్టారు–2ల్లో ఆయన తెదేపా అభ్యర్థిని గొలగాని మంగవేణితో కలిసి ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిశారు. స్థానిక సమస్యల పరిష్కారానికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వహాయంలో విశాఖనగరంలో జరిగిన అభివృద్ధిని వివరించారు. తూర్పు నియోజకవర్గంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు హాయంలో అభివృద్ధితో పాటు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇవ్వటం జరిగిందన్నారు. ప్రధానంగా అనునిత్యం (తరువాయి 8వ పేజీలో)

# నమ్మకానికి.. అమ్మకానికి మధ్య పోరు!

**చంద్రబాబుది 'సేల్ వైజాగ్'.. జగన్‌ది 'సేవ్ వైజాగ్'**

**విశాఖ భూములు, పర్యావరణ పరిరక్షణే లక్ష్యం: వైఎస్సార్‌సీపీ నేతలు**



విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల్లో నమ్మకానికి, అమ్మకానికి మధ్య పోరు జరుగుతోందని వైఎస్సార్‌సీపీ నేతలు పేర్కొన్నారు. చంద్రబాబు ప్రభుత్వ విధానం 'సేల్ వైజాగ్' కాగా, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం 'సేవ్ వైజాగ్' అని స్పష్టం చేశారు. విశాఖ భూములు, పర్యావరణం, ప్రజల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఎన్నికల్లో ప్రజల ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. విశాఖలోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, ఎమ్మెల్సీ, మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి, జిల్లా అధ్యక్షుడు కేకే రాజు మాట్లాడారు. అనంతరం 'సేవ్ వైజాగ్' పోస్టర్‌ను ఆవిష్కరించారు.

**భూములను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారు: కన్నబాబు**

విశాఖలో గత రెండున్నరేళ్లలో ప్రభుత్వం (తరువాయి 8వ పేజీలో)

# విశాఖ తూర్పులో కూటమికి విశేష ఆదరణ

**నాలుగు వార్డుల్లో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వెలగపూడి విస్తృత ప్రచారం**

**మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణికి మద్దతుగా ఇంటింటి ప్రచారం**





విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

జీవీఎంసీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో ఆదివారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. విశాఖ ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కూటమి మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి ప్రచారంలో పాల్గొని అభ్యర్థులకు (తరువాయి 8వ పేజీలో)

# నగర సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి

**ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ పిలుపు**

**గాజువాక నియోజకవర్గంలో ముమ్మరంగా జివిఎంసి ఎన్నికల ప్రచారం**



విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

గాజువాక నియోజకవర్గంలో జివిఎంసి ఎన్నికల నేపథ్యంలో కూటమి అభ్యర్థులకు మద్దతుగా విస్తృత ప్రచారం నిర్వహించారు. విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు, కూటమి మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి సంయుక్తంగా ప్రచారంలో పాల్గొని, కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జాగువానిపాలెం హైస్కూల్ రోడ్డులో 83వ వార్డు టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావుకు మద్దతుగా ప్రచారం ప్రారంభించారు. అనంతరం బొజ్జన్నకొండ, గుడివాడ అప్పన్న కాలనీ, మిందె గ్రామం పరిధిలో 84వ వార్డు టీడీపీ అభ్యర్థి మలికి అంజనీ కుమారికి మద్దతుగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. బి.సి. రోడ్ రైతుబజార్ నుంచి 91వ వార్డు టీడీపీ అభ్యర్థి బొడ్డు నరసింహ పాత్రుడు తరపున రోడ్ షో చేపట్టారు. అలాగే 89వ వార్డు టీడీపీ అభ్యర్థి ప్రసాదుల విజయసునీత, 90వ వార్డు టీడీపీ అభ్యర్థి మహ్మద్ రఫీ, 92వ వార్డు జనసేన అభ్యర్థి (తరువాయి 8వ పేజీలో)

## వాయుగుండం నేపథ్యంలో

# ప్రత్యేక అధికారుల నియామకం



విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

తీవ్ర వాయుగుండం నేపథ్యంలో జిల్లాలో భారీ వర్షాలు, విపత్తు నిర్వహణ చర్య లను పర్యవేక్షించేందుకు మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమి స్తూ జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే వివిధ శాఖల్లో బాధ్యతలు నిర్వహిస్తున్న అధి కారులకు అదనంగా ఈ బాధ్యతలు అప్పగించారు.

**నియమిత ప్రత్యేక అధికారులు – ఫోన్ నంబర్లు:**

భీమిలి నియోజకవర్గం : భీమునిపట్నం ఆర్డీఓ – 9849903854
విశాఖపట్నం తూర్పు: ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ –9848355128
విశాఖపట్నం దక్షిణం: విశాఖపట్నం ఆర్డీఓ –9849903825

(తరువాయి 8వ పేజీలో)

# 120 వార్డుల్లో 573 మంది అభ్యర్థులు

**గాజువాక జోన్‌లో అత్యధికంగా 139 మంది పోటీ**

విశాఖపట్నం, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ రెండో సాధారణ ఎన్నికల్లో 120 వార్డుల నుంచి మొత్తం 573 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థుల తుది వివరాలను ఆదివారం ఆయా జోన్ల రిటర్నింగ్ అధికారులు వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలోని పది జోన్లలో గాజువాక జోన్‌లో అత్యధికంగా 139 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఉత్తర జోన్‌లో 86 మంది, దక్షిణ జోన్‌లో 77 మంది, పశ్చిమ జోన్‌లో 72 మంది, తూర్పు జోన్‌లో 70 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పెందుర్తి జోన్‌లో 35 మంది, అగనంపూడి జోన్‌లో 28 మంది, మధురవాడ జోన్‌లో 27 మంది, అనకాపల్లి జోన్‌లో 20 మంది, భీమిలి జోన్‌లో 19 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. మొత్తం 120 వార్డులకు సంబంధించి అభ్యర్థుల తుది సంఖ్య వెల్లడికావడంతో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారింది. ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు (తరువాయి 8వ పేజీలో)

# ప్రారంభమైన మాలధారణ స్వాములకు అల్పాహారం





విశాఖపట్నం, అక్టోబర్ 25 ప్రభాతవార్త

శ్రీ సాయి ధ్యాన మందిర్ ఈస్ట్ షిరిడిలో దేవాలయం లో వేంచేసి ఉన్న శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో ఆదివారం నుండి బోత్ర షిప్పింగ్ ఆధ్వర్యం లో మాల ధారణ స్వాములకు అల్పాహారం ప్రారంభించారు. ఆలయ ట్రస్ట్ సభ్యులు దగ్గరుండి ఎక్కడ ఎవరికి ఇటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. డిసెంబర్ 15 వరకు బోత్రా షిప్పింగ్ కంపెనీ ఆధ్వర్యంలో అల్పాహారం అందిస్తున్నట్లు ఆలయ కమిటీ తెలిపారు. దీక్ష వహించిన అయ్యప్ప, భవాని, మాల ధరించిన స్వాములకు ఉదయం 07:00 గంల నుండి 08:00 గంల వరకు ప్రతి రోజు అల్పాహార వితరణ చేయబడును ఈ అవకాశం స్వాములు అందరూ పాల్గొవాలని కోరారు.

## మేయర్ పీఠం బరిలో 15 మంది

# కళ్యాణి, శ్రావణి మధ్యే ప్రధాన పోటీ

**ఆరుగురి నామినేషన్ల ఉపసంహరణ.. అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు**

విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ మేయర్ పీఠం కోసం 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మేయర్ పదవికి దాఖలైన నామినేషన్ల పరిశీలన, ఉపసంహరణ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో తుది అభ్యర్థుల జాబితాను ఆదివారం ఎన్నికల అధికారులు ప్రకటించారు. ప్రధాన పార్టీల తరఫున తెలుగుదేశం పార్టీ నుంచి డాక్టర్ ముక్కా శ్రావణి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వరుదు కల్యాణి పోటీలో ఉండటంతో వీరిద్దరి మధ్య ప్రధాన పోటీ నెలకొంది. బహుజన సమాజ్ పార్టీ, కాంగ్రెస్, భారత చైతన్య యువజన పార్టీ అభ్యర్థులతో పాటు స్వతంత్ర అభ్యర్థులు కూడా మేయర్ పదవికి పోటీలో ఉన్నారు.

**29 నామినేషన్ల నుంచి 15 మంది అభ్యర్థులు.**

జీవీఎంసీ మేయర్ పదవికి మొత్తం 29 నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో ఎనిమిది నామినేషన్లు తిరస్కరణకు గురికాగా, (తరువాయి 8వ పేజీలో)

# మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది

**ఫిషింగ్ హార్బర్‌లో వరుదు కళ్యాణి విస్తృత ప్రచారం**



విశాఖపట్నం, అక్టోబర్ 25 ప్రభాతవార్త :

మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్ సీపీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జీవీఎంసీ మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి పేర్కొన్నారు. జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మత్స్యకారులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా వరుదు కళ్యాణి మాట్లాడుతూ, తనను మేయర్‌గా గెలిపిస్తే పోర్టు అధికారులతో చర్చించి, ఫిషింగ్ హార్బర్‌లో ఆధునిక మార్కెటింగ్ కాంప్లెక్స్ ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇటీవల విశాఖ తీరంలో బోటు మునిగి ఏడుగురు మత్స్యకారులు గల్లంతైన ఘటనపై విచారం వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలను పరామర్శించడంలో స్థానిక మంత్రి నిర్లక్ష్యం వహించారని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పందించి బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందించారని గుర్తుచేశారు.

కూటమి ప్రభుత్వానికి మత్స్యకారుల ఓట్లు మాత్రమే కావాలని, వారి సంక్షేమం, అభివృద్ధి పై ఆసక్తి లేదని (తరువాయి 8వ పేజీలో)

## హెచ్పీసీఎల్ ఆధ్వర్యంలో

# విజిలెన్స్ అవగాహనపై వాకథాన్

**విశాఖ బీచ్ రోడ్లో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు-2026**

విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

ప్రజా జీవితంలో నిబద్ధతను పునరుద్ఘాటిస్తూ, హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్పీసీఎల్) విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు–2026లో భాగంగా విశాఖలోని బీచ్ రోడ్డులో ఆదివారం వాకథాన్ న్ను నిర్వహించింది. ఈ వాకథాను హెచ్పీసీఎల్ (తరువాయి 8వ పేజీలో)



## పూర్వపు విద్యార్థుల అపూర్వ కలయిక

(7వ పేజీ తరువాయి)

ఒకరికొకరు కుటుంబ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. విదేశాలలో వివిధ హోదాలలో స్థిరపడిన వారు కూడా ఇక్కడ జరిగిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయకకు ప్రత్యేకంగా విచ్చేశారు. ప్రముఖ హోమియో వైద్యులు బి శశిధర్ నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమానికి వార్త జనరల్ మేనేజర్ గ్రంధి రాజేశ్వరరావు, నావెల్ కమాండెంట్ ధీరజ్, దొడ్డి రమేష్, ఎల్లపు శ్రీనివాసరావు, కొత్తూరు కు చెందిన మేడిశెట్టి సత్తిబాబు, వివిధ హోదాల్లో స్థిరపడిన పూర్వపు విద్యార్థులు ఈ కార్యక్రమానికి విచ్చేశారు.
సమాగమం పేరిట 1989బి1990 పదో తరగతి బ్యాచ్ పూర్వపు విద్యార్థుల భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళికపై చర్చించారు.

## యువత గల్లీ గొడవలు వదిలి రాజకీయాల్లోకి రండి

(7వ పేజీ తరువాయి)

యువతను ఉద్దేశించి ఎంపీ విజయ్ మాట్లాడుతూ.. పనులను రేపు చేద్దాంలే అని వాయిదా వేసే (ప్రోక్రాస్టినేషన్) అలవాటును యువత ముందుగా మానుకోవాలని సూచించారు. ఏదైనా ఒక మంచి పనిని లేదా వ్యాయామాన్ని 22 రోజుల పాటు క్రమం తప్పకుండా చేస్తే, అది మన మెదడుకు శాశ్వత అలవాటుగా మారిపోయి సక్సెస్ వైపు నడిపిస్తుందని ఆయన వివరించారు.

## టీడీపీలోకి పోటెత్తిన వలసలు!

(7వ పేజీ తరువాయి)

ప్రభుత్వంలో వలంటీర్‌గా పనిచేసిన 13వ వార్డుకు చెందిన చిటికల శ్రీను ఆధ్వర్యంలో వీరంతా పార్టీ మారారు. 17వ వార్డు టీడీపీ అభ్యర్థి యాదగిరి దాసు, 13వ వార్డు అభ్యర్థి చెల్లా పోతురాజుల నేతృత్వంలో ఈ చేరికల కార్యక్రమం జరిగింది. చింతకాయల రాజేష్ పార్టీలో చేరిన వారికి నర్సీపట్నం టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ పసుపు కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ.. టీడీపీ ప్రభుత్వం, పార్టీ నాయకత్వం ప్రజల పక్షాన నిలబడుతుందన్న నమ్మకంతోనే ఈ భారీ చేరికలు జరుగుతున్నాయన్నారు. ఏ సమయంలోనైనా, ఎటువంటి ఆపదలోనైనా పార్టీలో చేరిన వారికి తాను తోడుగా ఉంటూ, పూర్తి భరోసా కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. రోజురోజుకూ పెరుగుతున్న ఈ వలసలు నర్సీపట్నంలో టీడీపీకి పెరుగుతున్న ప్రజాదరణకు నిదర్శనమని నాయకులు పేర్కొన్నారు.

## 22వవార్డు ఎన్నికల ప్రచారంలో వీఎంఆర్‌డీప చైర్మన్

(7వ పేజీ తరువాయి)

ప్రజలతో మమేకమయ్యే గొలగాని మంగవేణితో పాటు మేయరు అభ్యర్థిని ముక్కా శ్రావణికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో బాగంగా పలు అపార్టమెంట్‌లకు వెళ్లి ఆయా అపార్టమెంట్ వాసులను కలిసి కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి, భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. అనంతరం పలు చర్చిల్లో ప్రార్థనల్లో సైతం పాల్గొన్నారు. ప్రచారంలో భాగంగా స్థానిక నాయకులు గొలగాని పోలారావు, మసేను, కారి రామారావు, నూకరాజులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

## నమ్మకానికి.. అమ్మకానికి మధ్య పోరు!

(7వ పేజీ తరువాయి)

చేసిన అభివృద్ధి ఏమిటని మాజీ మంత్రి కురసాల కన్నబాబు ప్రశ్నించారు. విలువైన భూములను కార్పొరేట్లకు కట్టబెడుతూ నగరాన్ని 'సేల్ వైజాగ్'గా మారుస్తున్నారని ఆరోపించారు. తాగునీటి సమస్య, మౌలిక సదుపాయాల కొరతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల్లో నామినేషన్లను అడ్డుకోవడం, అభ్యర్థులను బెదిరించడం ప్రజాస్వామ్యానికి విఘాతమని పేర్కొన్నారు. 'సేవ్ వైజాగ్' ఉద్యమానికి ప్రజలు మద్దతు తెలిపి వరుదు కళ్యాణితో పాటు పార్టీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.
'బ్లూ వైజాగ్'తో సమగ్ర అభివృద్ధి: అమర్నాథ్
'బ్లూ వైజాగ్' నినాదంతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ తెలిపారు. బీచ్‌ల అభివృద్ధి, పర్యాటకం, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు, పార్కులు, ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. 'విజన్ విశాఖ' ప్రణాళిక ఆధారంగా ముందుకు సాగుతామని పేర్కొన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వరుదు కళ్యాణితో పాటు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.
భూముల వ్యవహారంలో కూటమి వైఖరిపై విమర్శలు: కేకే రాజు
విశాఖలో ప్రజాస్వామ్యానికి, అధికార దర్పానికి మధ్య పోటీ జరుగుతోందని జిల్లా అధ్యక్షుడు కేకే రాజు అన్నారు. విలువైన భూముల వ్యవహారంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను బెదిరిస్తూ నామినేషన్ల ఉపసంహరణకు ఒత్తిడి తెస్తున్నారని ఆరోపించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి వరుదు కళ్యాణిని మేయర్‌గా, పార్టీ అభ్యర్థులను కార్పొరేటర్లుగా గెలిపించాలని కోరారు.
విశాఖ విధ్వంసంపై ప్రజలు తీర్పునివ్వాలి: వరుదు కళ్యాణి
కూటమి ప్రభుత్వం హామీలను అమలు చేయకుండా విశాఖ అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తోందని మేయర్ అభ్యర్థి వరుదు కళ్యాణి విమర్శించారు. తాగునీటి ఎద్దడి, పర్యావరణ సమస్యలు, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ముప్పుపై ఆందోళన వ్యక్తం చేశారు. పేదల చిన్న ఇళ్ల తొలగింపుపై చర్యలు తీసుకుంటున్న ప్రభుత్వం, విలువైన భూముల వ్యవహారంలో మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజలు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్టీ సమన్వయకర్తలు మళ్ల విజయప్రసాద్, అన్నంరెడ్డి అదీప్‌రాజ్, తిప్పల శ్రీనివాస్ దేవన్‌రెడ్డి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, తైనాల విజయకుమార్, మాజీ మేయర్ గొల్లగాని హరి వెంకటకుమారి తదితరులు పాల్గొన్నారు. పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

(7వ పేజీ తరువాయి)

ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని, అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

### సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలి

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

### మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు

తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి సూచించారు. బీచ్‌లలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ఇతర ప్రమాదకర కార్యకలాపాలకు పాల్పడటం వంటివి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

### వదంతులను నమ్మొద్దు.. అధికారిక హెచ్చరికలను పాటించాలి

తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు, ప్రజలు తమ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) జారీ చేసే అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## హెచ్పీసీఎల్ ఆధ్వర్యంలో విజిలెన్స్ అవగాహనపై వాకథాన్

(7వ పేజీ తరువాయి)

విజిలెన్స్ అధికారి వేద్ ప్రకాష్ వర్మ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో హెచ్పీసీఎల్ అధికారులు, వారి కుటుంబ సభ్యులు, అలాగే నైపుణ్యాభివృద్ధి సంస్థ విద్యార్థులతో సహా 300 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. అవినీతి రహిత, సుసంపన్నమైన సమాజాన్ని నిర్మించడంలో నిజాయితీ, సమగ్రత, జవాబుదారీతనం మరియు పారదర్శకతల ప్రాముఖ్యతను చాటుతూ, విజిలెన్స్ అవగాహన వారోత్సవాల "శ్రేయస్సు కోసం నిజాయితీ" అనే ఇతివృత్తానికి అనుగుణంగా ఈ వాకథాన్ను నిర్వహించారు. అవినీతిని నివారించడంలో వ్యక్తిగత, వృత్తి జీవితాలలో నైతిక విలువల పరిరక్షణలో వ్యక్తుల పాత్ర గురించి అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ లక్ష్యమని తెలియజేశారు. నైతిక పరిపాలనను పెంపొందించడం, తరతరాలుగా నిజాయితీ సంస్కృతిని ప్రోత్సహించడం పట్ల గల సామూహిక బాధ్యతను ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, వారి కుటుంబాలు, విద్యార్థుల భాగస్వామ్యం ప్రముఖంగా తెలియజేస్తోంది.

### మేయర్ పీఠం బరిలో 15 మంది

## కల్యాణి, శ్రావణి మధ్యే ప్రధాన పోటీ

(7వ పేజీ తరువాయి)

మిగిలిన 21 నామినేషన్లు సక్రమంగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. అక్టోబర్ 21న జరిగిన ఉపసంహరణ ప్రక్రియలో ఆరుగురు అభ్యర్థులు తమ నామినేషన్లను వెనక్కి తీసుకున్నారు. దీంతో తుది జాబితాలో 15 మంది అభ్యర్థులు నిలిచారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అక్టోబర్ 25న తుది జాబితాను ప్రకటించినట్లు మేయర్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి. దయానిధి వెల్లడించారు.

### ప్రధాన పార్టీల అభ్యర్థులు వీరే..

బహుజన సమాజ్ పార్టీ తరఫున కరణం కీర్తన గ్రేస్ (ఏనుగు), భారత జాతీయ కాంగ్రెస్ నుంచి దేవర నాగ సునందా దేవి (చేయి), తెలుగుదేశం పార్టీ తరఫున డాక్టర్ ముక్కా శ్రావణి (సైకిల్), వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వరుదు కల్యాణి (ఫ్యాన్), భారత చైతన్య యువజన పార్టీ తరఫున నమ్మి భవాని (బ్యాటరీ దీపం) పోటీలో ఉన్నారు.

### స్వతంత్ర అభ్యర్థుల గుర్తులివే..

స్వతంత్ర అభ్యర్థులుగా ఫ్రాన్సినమ్మ అత్తిలి (సీసా), గొంప వెంకట పద్మావతి (కప్పు, సాసరు), శైలజ తలుపుల (పాఠశాల సంచి), ప్రియాంక దండి (శీతలీకరణ యంత్రం), పకృతి దేవిక (ఉంగరం), బోర సంతోషి (కాలీఫ్లవర్), లిఖిత లండ (కొవ్వొత్తులు), వాండ్రాసి శాంతి కుమారి (పల్లకి), వియ్యపు ఉమ (వేణువు), షేక్ దౌలతున్నీసా (బీరువా) బరిలో నిలిచారు.

### ఆరుగురి ఉపసంహరణ

మేయర్ పదవికి కాంగ్రెస్ నుంచి వెంకటలక్ష్మి జర్రిపోతుల, ఉస్నారా పర్వీన్, తెలుగుదేశం పార్టీ నుంచి సేనాపతి వసంత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి పేడాడ రమణి కుమారి, తిప్పల వెంకట విజయ కుమారి, స్వతంత్ర అభ్యర్థి పులిచర్ల రాజేశ్వరి తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు.

### నవంబర్ 1న పోలింగ్.. 3న లెక్కింపు

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల్లో భాగంగా నవంబర్ 1న పోలింగ్ నిర్వహించనున్నారు. నవంబర్ 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. మేయర్ పీఠం కోసం ప్రధాన పార్టీల అభ్యర్థులు రంగంలో ఉండటంతో రానున్న రోజుల్లో ఎన్నికల పోరు మరింత ఆసక్తికరంగా మారనుంది.

## విశాఖ దక్షిణంలో కూటమి కీచులాటలు

(7వ పేజీ తరువాయి)

ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కూటమి తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులందరికీ సమానంగా సహకారం అందకపోతే, ఓట్ల బదిలీపై ప్రభావం పడే అవకాశం ఉంది. ఇప్పటికే ప్రచారంలో నిమగ్నమైన అభ్యర్థులకు స్థానిక నాయకుల మద్దతు కీలకంగా మారిన నేపథ్యంలో, ఈ అసంతృప్తికి నాయకత్వం ఎలా పరిష్కారం చూపుతుందన్నది ఆసక్తికరంగా మారింది. విశాఖ దక్షిణంలో మూడు పార్టీల మధ్య సమన్వయ లోపాన్ని సరిదిద్దేందుకు కూటమి నాయకత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. స్థానిక స్థాయిలో నెలకొన్న అసంతృప్తిని సకాలంలో పరిష్కరించకపోతే, అది ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపే అవకాశం లేకపోలేదు. మరి కూటమి నాయకులు విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతారా? లేక అంతర్గత అసంతృప్తి ఎన్నికల వేళ మరింత ముదురుతుందా? అన్నది వేచి చూడాలి.

### కూటమి అభ్యర్థి ఇందల వెంకట రమణకు మద్దతుగా ప్రచారం నిర్వహించిన

## ఏపీ బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి

విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

పెందుర్తి నియోజకవర్గం, సబ్బవరం మండలం, నంగినారుపాడు ప్రాంతంలో జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో 113వ వార్డు బీజేపీ, జనసేన, తెలుగుదేశం పార్టీ (టీడీపీ) కూటమి బలపరిచిన అభ్యర్థి ఇందల వెంకట రమణకు మద్దతుగా ఆంధ్రప్రదేశ్ బీజేపీ మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ఆయన స్థానిక ప్రజలను కలిసి కూటమి అభ్యర్థి ఇందల వెంకట రమణకు మద్దతు తెలపాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రజలతో మమేకమై, వార్డులోని స్థానిక సమస్యలు, ప్రజల అవసరాలు, అభివృద్ధికి సంబంధించిన అంశాలపై వారితో మాట్లాడారు. ప్రజల సమస్యలను తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలకు ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వం అవసరమని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. స్థానిక ప్రాంత అభివృద్ధి, ప్రజల సంక్షేమం, మౌలిక సదుపాయాల మెరుగుదల వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని తెలిపారు. పెందుర్తి నియోజకవర్గం పరిధిలోని సబ్బవరం మండలం నంగినారుపాడులో



నిర్వహించిన ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి అభ్యర్థి తరఫున ప్రజలను కలుసుకుని, ఎన్నికల్లో ఇందల వెంకట రమణకు మద్దతు ఇవ్వాలని వెన్నా శ్రీరామమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కూటమి శ్రేణులు, పార్టీ కార్యకర్తలు పాల్గొని ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు.

## విశాఖ తూర్పు నియోజకవర్గంలో కూటమి భారీ రోడ్‌షో

**ఆర్కే బీచ్ ఎన్టీఆర్ విగ్రహం నుంచి పెదవాల్తేర్ ఎన్టీఆర్ విగ్రహం వరకూ రోడ్ షో**
**అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలి: ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్..**

విశాఖపట్నం, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

జీవీఎంసీ ఎన్నికల ప్రచారంలో భాగంగా విశాఖ తూర్పు నియోజకవర్గంలో కూటమి మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ ఆధ్వర్యంలో ఆర్కే బీచ్‌లోని కాళీమాత ఆలయం నుంచి చినవాల్తేరు, పెదవాల్తేరు వరకు భారీ రోడ్‌షో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్పొరేటర్ అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు, యువత పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.
24వ వార్డు టీడీపీ అభ్యర్థి రాజ్యలక్ష్మి, 25వ వార్డు టీడీపీ అభ్యర్థి పీతల అవినాష్, 29వ వార్డు టీడీపీ అభ్యర్థి అనగాని శివరామకృష్ణ లకు మద్దతుగా నిర్వహించిన ఈ ప్రచారంలో కూటమి శ్రేణులు ఉత్సాహంగా పాల్గొన్నాయి. వందలాది మంది యువకులు బైక్ ర్యాలీగా ముందుకు సాగుతూ ప్రచారానికి మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారు. చినవాల్తేరులో మాజీ మేయర్ రాజా నరమణి కూటమి నాయకులకు ఘనస్వాగతం పలికి, అభ్యర్థుల విజయానికి తన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్,



మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, విశాఖపట్నం నగర సమగ్ర అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన కోసం కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. నగర అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని, కూటమి అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటును సైకిల్ గుర్తుపై వేసి విజయాన్ని అందించాలని కోరారు. విశాఖపట్నాన్ని అభివృద్ధి పథంలో మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కూటమి అభ్యర్థులకు ప్రజలు సంపూర్ణ మద్దతు అందించాలని ఎంపీ శ్రీభరత్ విజ్ఞప్తి చేశారు.

## విశాఖ అభివృద్ధే లక్ష్యంగా వరుదు కళ్యాణి ప్రచారం

**జైన్ టెంపుల్‌లో ప్రత్యేక ప్రార్థనలు.. రెడ్డి, కళింగ వైశ్యుల ఆత్మీయ సమావేశాల్లో పాల్గొనడం**

విశాఖపట్నం, అక్టోబర్ 25 (ప్రభాతవార్త): జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మేయర్ అభ్యర్థి, ఎమ్మెల్సీ వరుదు కళ్యాణి ఆదివారం నగరంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. డాల్ఫిన్ హోటల్ సమీపంలోని పంత్ భవన్ జైన్ టెంపుల్‌ను సందర్శించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం హెచ్‌బీ కాలనీలో నిర్వహించిన రెడ్డి సామాజిక వర్గ ఆత్మీయ సమావేశం, హోటల్ దస్పల్లా ఎగ్జిక్యూటివ్ కోర్ట్‌లో జరిగిన కళింగ వైశ్యుల సమావేశంలో పాల్గొని మద్దతు కోరారు. జైన్ టెంపుల్‌లో మత పెద్దలను కలుసుకున్న ఆమె శాంతి, సామరస్యం, సోదరభావం వెల్లివిరియాలని ఆకాంక్షించారు. అన్ని వర్గాల విశ్వాసాలను గౌరవిస్తూ నగర అభివృద్ధి, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని తెలిపారు. రెడ్డి సామాజిక వర్గ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ముల్లి అప్పారావు పాల్గొన్నారు. కళింగ వైశ్యుల సమావేశంలో సంఘ ప్రతినిధులు, పార్టీ నాయకులు వరుదు కళ్యాణికి



మద్దతు తెలిపారు. రానున్న ఎన్నికల్లో ఆమె విజయానికి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో తాళాసు సాయి మోహన్, పట్నాన వెంకటరమణ, వారణాసి శ్రీను, భోగి జనార్దన్ రావు తదితరులు పాల్గొన్నారు.

### తుపాను హెచ్చరికలతో

## సింహాచలం దేవస్థానం అప్రమత్తం

**ముందస్తు చర్యలపై ఈవో జల్లేపల్లి వెంకటరావు సమీక్ష**

సింహాచలం, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

తుపాను హెచ్చరికల నేపథ్యంలో శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు భారీ వర్షాలు, పెనుగాలులు వీచే అవకాశం ఉందన్న హెచ్చరికలతో భక్తుల భద్రత కు ముందస్తు చర్యలు చేపట్టారు. దేవస్థానం ఈవో జల్లేపల్లి వెంకటరావు ఆదివారం ఆలయ కార్యాలయంలో వివిధ విభాగాల అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. తుపాను సమయంలో ఎలాంటి పరిస్థితినైనా ఎదుర్కొనేం దుకు ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని, కొండపై కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కొండపై డ్రైనేజీలను శుభ్రం చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో రక్షణ చర్యలు చేపట్టడం, ఈదురు గాలులకు చెట్లు కూలితే వెంటనే తొలగించేలా సిబ్బందిని సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్ అంతరాయం ఏర్పడితే జనరేటర్లు వినియోగిం చేందుకు డీజిల్ నిల్వలు, భక్తులకు తాగునీరు,



స్వామివారి నివేదన, నిత్యాన్నప్రసాదానికి అవసరమైన సరుకులను కనీసం పది రోజులకు సరిపడా అం దుబాటులో ఉంచాలని ఆదేశించారు. తుపాను తీవ్రత అధికంగా ఉన్న సమయంలో భక్తుల భద్రత దృష్ట్యా కొండపైకి వెళ్లే మెట్ల మార్గాన్ని మూసివేయాలని సూచిం చారు. కొండ దిగువన ఉన్న శ్రీకృష్ణాపురం గోశాలలో గోవులకు పచ్చిమేత, ఎండుగడ్డి, దాణా, తాగునీరు అందు బాటులో ఉంచాలని ఆదేశించారు. తుపాను ప్రభావిత రోజుల్లో అధి కారులు, సిబ్బంది సమన్వ యంతో పనిచేస్తూ ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షించాలని ఈవో స్పష్టం చేశారు. సమీక్షలో ఇంజనీరింగ్ అధికారులు, సహాయ కార్యనిర్వ హణాధికారు లు, పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

### గుర్తు తెలియని

## మృతదేహం లభ్యం

విశాఖ క్రైమ్ , అక్టోబర్ 25 ప్రభాతవార్త

విశాఖపట్నం రైల్వే స్టేషన్ లో ఒకటో నెంబర్ గేటు వద్ద ఆదివారం గుర్తుతెలియని మృతదేహాన్ని ను పోలీసులు గుర్తించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుమారు 40 నుండి 45 సంవత్సరాలు వయస్సు గల పురుషునిగా తెలిపారు. మృతి చెందిన వ్యక్తి వివరాలు తెలిసినవారు నాలుగో పట్టణ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.



## విశాఖ తూర్పులో కూటమికి విశేష ఆదరణ

(7వ పేజీ తరువాయి)

మద్దతుగా ఓట్లు అభ్యర్థిం చారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలు పూలతో స్వాగతం పలుకుతూ తమ మద్దతు ప్రకటించారు.

### నాలుగు వార్డుల్లో ప్రచారం

13వ వార్డు వివేకానంద నగర్‌లో కూటమి అభ్యర్థి మద్దిల రామలక్ష్మి రాజశేఖర్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. 14వ వార్డు గాంధీనగర్‌లో అభ్యర్థి కాకి గంగరాజు తరఫున ఓటర్లను కలుసుకుని ఓట్లు అభ్యర్థించారు. 15వ వార్డు సూర్యానగర్, సుందరయ్య నగర్ ప్రాంతాల్లో ఒమ్మి అప్పలరాజుకు మద్దతుగా ప్రచారం సాగింది. 16వ వార్డులోని ఆరిలోవ పోలీస్ స్టేషన్ నుంచి చివరి బస్ స్టాప్ వరకు టీడీపీ అభ్యర్థి ఏడువాక మహాలక్ష్మికి మద్దతుగా ర్యాలీ నిర్వహించారు.

### విశాఖను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతాం: శ్రీభరత్

ఈ సందర్భంగా ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గంలోని నాలుగు వార్డుల్లో ప్రజల నుంచి విశేష స్పందన లభించిందన్నారు. మౌలిక సదుపాయాల కల్పన, అభివృద్ధి పనుల వేగవంతం, మెరుగైన పౌర సేవల కోసం కూటమి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. విశాఖపట్నాన్ని ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

### నగర సమగ్ర అభివృద్ధికి సహకరించండి: ముక్కా శ్రావణి

మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి మాట్లాడుతూ, తూర్పు నియోజకవర్గంలోని ప్రతి వార్డులోనూ ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబుపై ప్రజలకు ఉన్న విశ్వాసం ప్రచారంలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు. నగర సమగ్ర అభివృద్ధి, మెరుగైన మౌలిక సదుపాయాలు, పారదర్శక పాలన కోసం కూటమి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

### అభివృద్ధి, మెరుగైన సదుపాయాలే లక్ష్యం: వేపాడ

ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవి రావు మాట్లాడుతూ, విశాఖపట్నాన్ని ప్రశాంతమైన, అభివృద్ధి చెందిన నగరంగా తీర్చిదిద్దేందుకు కూటమి సమర్థులైన అభ్యర్థులను బరిలోకి దించిందన్నారు. పారిశ్రామిక, ఐటీ రంగాల్లో మరింత పురోగతితో పాటు ప్రజలకు మెరుగైన సదుపాయాలు అందాలంటే కూటమి మేయర్, కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

### తూర్పు నియోజకవర్గం టీడీపీకి కంచుకోట: వెలగపూడి

ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, విశాఖ తూర్పు నియోజకవర్గం టీడీపీకి కంచుకోట వంటిదన్నారు. జీవీఎంసీ ఎన్నికల్లో కూటమికి అత్యధిక మెజార్టీ లభిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రచారానికి వెళ్లిన ప్రతిచోటా ప్రజల నుంచి మంచి స్పందన లభిస్తోందని, మేయర్ అభ్యర్థి ముక్కా శ్రావణితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, వార్డు అభ్యర్థులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## వాయుగుండం నేపథ్యంలో ప్రత్యేక అధికారుల నియామకం

(7వ పేజీ తరువాయి)

విశాఖపట్నం ఉత్తరం: జిల్లా సహకార అధికారి -9100109164
విశాఖపట్నం పశ్చిమం: జిల్లా పర్యాటక అధికారి -9000013610
గాజువాక: వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి -63099444449
పెందుర్తి: జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి -9849902145
ఆనందపురం : జెడ్ఎం, ఏపీఐఐసీ -9848933874
పద్మనాభం : స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ -9494918484
విశాఖపట్నం రూరల్ మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, మహారాణిపేట మండలానికి విశాఖపట్నం ఆర్డీఓ, సీతమ్మధార మండలానికి జిల్లా సహకార అధికారి, గోపాలపట్నం మండలానికి జిల్లా పర్యాటక అధికారి, ములగాడ మండలానికి వీఎంఆర్‌డీఏ ఓఎస్డీ (7992416144), గాజువాక మండలానికి వీఎంఆర్‌డీఏ ఎస్టేట్ అధికారి, పెదగంట్యాడ మండలానికి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (9849903829) పర్యవేక్షణ బాధ్యతలు చేపడతారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, వర్షాలు, వాయుగుండం ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

## మత్స్యకారుల సంక్షేమానికి వైఎస్సార్‌సీపీ కట్టుబడి ఉంది

(7వ పేజీ తరువాయి)

ఆరోపించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రవ్యాప్తంగా తొమ్మిది కొత్త ఫిషింగ్ హార్బర్లు, ఆరు ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. తొలి విడతలో సుమారు రూ.1,500 కోట్లకు పైగా అంచనా వ్యయంతో ఉప్పాడ, జువ్వలదిన్నె, నిజాంపట్నం, మచిలీపట్నం (గిలకలదిండి) హార్బర్ల పనులు ప్రారంభించగా, రెండో విడతలో బుడగట్లపాలెం, పూడిమడక, కొత్తపట్నం, బియ్యపుతిప్ప, ఓడరేవు ప్రాంతాల్లో హార్బర్లను ప్రతిపాదించినట్లు వివరించారు. మంజిలపూడి, చింతపల్లి, రాజయ్యపేట, అంతర్వేది, ఆలూరు తదితర ప్రాంతాల్లో ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు.
కూటమి ప్రభుత్వంపై వాసుపల్లి విమర్శలు మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో సామాన్యులు జీవనం సాగించడం కష్టంగా మారిందని విమర్శించారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయని ఆరోపించారు. మరోవైపు వేలాది ఎకరాల ప్రభుత్వ భూములను బినామీలకు అతి తక్కువ ధరలకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మత్స్యకారులకు వేటకు వెళ్లే సమయంలో బీమా సదుపాయాలు, పింఛన్లు సక్రమంగా అందడం లేదని ఆరోపించారు. ప్రజలు వైఎస్సార్‌సీపీకి మద్దతుగా నిలిచి పార్టీ అభ్యర్థులను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. ఈ ప్రచార కార్యక్రమంలో సినీ నటుడు జోగినాయుడు, వైఎస్సార్‌సీపీ మత్స్యకార విభాగం అధ్యక్షుడు పేర్ల విజయ్ చంద్ర, అల్లంపల్లి రాజబాబు, చెన్నా జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## నగర సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలి

(7వ పేజీ తరువాయి)

తిప్పల శ్రీజలకు మద్దతుగా బి.సి. రోడ్, ఐటీఐ రోడ్డు ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ మాట్లాడుతూ, విశాఖపట్నం నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు జివిఎంసీలో కూటమి అభ్యర్థుల విజయం ఎంతో కీలకమని అన్నారు. ప్రజలకు సమర్థవంతమైన పాలన అందించడంతో పాటు, అభివృద్ధి కార్యక్రమాలను వేగంగా అమలు చేయాలంటే మేయర్, కార్పొరేటర్ల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.

### సమర్థవంతమైన మేయర్ నాయకత్వంతో సమగ్ర అభివృద్ధి

కూటమి మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణి గతంలో ఐదేళ్లపాటు కష్టపడి, నిజాయితీగా పనిచేసి మంచి గుర్తింపు తెచ్చుకున్నారని ఎంపీ ప్రశంసించారు. నగరంలోని 98 వార్డులకు ఎలాంటి వివక్ష లేకుండా సమాన ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి చేసే సామర్థ్యం ఆమెకు ఉందని విశ్వాసం వ్యక్తం చేశారు.

### స్థానిక సమస్యల పరిష్కారానికి కార్పొరేటర్లే కీలకం

వీధి దీపాలు, డ్రైనేజీ, రహదారులు, తాగునీటి సరఫరా వంటి ప్రజల నిత్యజీవిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడంలో స్థానిక కార్పొరేటర్ల పాత్ర అత్యంత ముఖ్యమని శ్రీభరత్ పేర్కొన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యలపై తక్షణమే స్పందించే ప్రజాప్రతినిధులు ఉంటే నగర పాలన మరింత మెరుగుపడుతుందని అన్నారు.

### అభివృద్ధి పనులకు సమన్వయం -- ప్రజలకు సుపరిపాలన

ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి ప్రాజెక్టులు, మౌలిక సదుపాయాల పనులు వేగంగా పూర్తికావాలంటే జివిఎంసిలో సమన్వయంతో కూడిన పాలన అవసరమని ఎంపీ స్పష్టం చేశారు. గతంలో సమన్వయ లోపం కారణంగా కొన్ని పనులు ఆలస్యమైన విషయాన్ని ప్రస్తావిస్తూ, భవిష్యత్తులో అలాంటి ఇబ్బందులు లేకుండా ప్రజలకు మెరుగైన పాలన అందించడమే కూటమి లక్ష్యమని తెలిపారు.

### కూటమి అభ్యర్థులకు భారీ మెజారిటీ అందించండి

ఎన్నికలకు మిగిలిన కొద్ది రోజులు కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో మరింత కష్టపడి పనిచేయాలని ఎంపీ శ్రీభరత్ పిలుపునిచ్చారు. నగర భవిష్యత్తు, ప్రజల సంక్షేమం, అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని మేయర్ అభ్యర్థి డాక్టర్ ముక్కా శ్రావణితో పాటు కూటమి కార్పొరేటర్ అభ్యర్థులందరినీ భారీ మెజారిటీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ ప్రచార కార్యక్రమాల్లో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## 120 వార్డుల్లో 573 మంది అభ్యర్థులు

(7వ పేజీ తరువాయి)

ఇతర అభ్యర్థులు కూడా బరిలో ఉండటంతో వివిధ వార్డుల్లో పోటీ నెలకొంది. జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల పోలింగ్ నవంబరు 1న జరగనుండగా, నవంబరు 3న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు. ఈ మేరకు ఎన్నికల నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

vsp9:vsp9.qxd 25-10-2026 23:44 Page 1






## తీవ్ర తుఫాను హెచ్చరిక నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### జిల్లా అధికారులకు కలెక్టర్ టి.నిశాంతి ఆదేశాలు



పాడేరు,అక్టోబర్25,ప్రభాతవార్త;

బంగాళాఖాతంలో ఏర్పడిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో అత్యంత తీవ్ర తుఫాను హెచ్చరికలపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు కలెక్టర్ టి. నిశాంతి జిల్లా అధికారులను ఆదేశిం చారు. తుఫాను ప్రభావం వల్ల ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.ఆదివారం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షలో తుఫాను హెచ్చరికల నేపథ్యంలో జిల్లాలో తీసుకోవాల్సిన ముందస్తు చర్యలు, ప్రజల భద్రత, అత్యవసర సేవల సంసిద్ధత, మారుమూల గిరిజన ప్రాంతాల్లో పరిస్థితుల పర్యవేక్షణ, తదితర అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

**తుఫాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ముందస్తు చర్యలు**

తుఫాను పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ, భారత వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. భారీ వర్షాలు, ఈదురుగాలుల కార ణంగా ప్రజలకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదే శించారు. ముఖ్యంగా కొండ ప్రాంతాలు, మారుమూల గిరిజన గ్రామాలు, రహదారులు మరియు ఇతర ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.అత్యవసర పరిస్థితులు తలెత్తినప్పుడు వెంటనే స్పందించేలా సంబంధిత శాఖల అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సిద్ధంగా ఉండాలని, అవసరమైన సహాయక చర్యలను వేగంగా చేపట్టేందుకు సమన్వయంతో పనిచేయాలని స్పష్టంచేశారు. ప్రజలకు వాతా వరణ హెచ్చరికలు, అవసరమైన సూచనలు ఎప్పటికప్పుడు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

**జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**

జిల్లాలో జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తుఫాను ప్రభావం కారణంగా ఎన్నికల నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని సూచించారు.ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లు, అవసరమైన సామగ్రి, సిబ్బంది సంసిద్ధత, సంబంధిత కేంద్రాలు మరియు ఇతర లాజిస్టికల్ అంశాలను ముందుగానే సమీక్షించి, ఎటువంటి చివరి నిమిషం ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తుఫాను పరిస్థితుల నేపథ్యంలో ఎన్నికల ఏర్పాట్లకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, తుఫాను హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని ఎన్నికల ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. పరిస్థితులకు అనుగుణంగా అవసరమైన చర్యలు చేపట్టేందుకు అధికారులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి**

తుఫాను హెచ్చరికల నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, పరిస్థితు లను నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ తెలిపారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, అత్యవసర సేవలకు అంతరాయం లేకుండా, ఎన్నికల ఏర్పాట్లు సజావుగా కొనసాగేందుకు సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగాలని ఆదేశించారు.

## టీవీలు, డిజిటల్, సోషల్ మీడియాలో రాజకీయ ప్రకటనలకు ఎంసీఎంసీ ముందస్తు అనుమతులు తప్పనిసరి



పాడేరు,అక్టోబర్25, ప్రభాతవార్త;

జిల్లా కలెక్టర్ టి. నిషాంతి ఆదేశాల మేరకు, ఎన్నికల నేపథ్యంలో టీవీలు, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా రాజకీయ ప్రకటనలను ప్రసారం చేయడానికి, ప్రచురించడానికి మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా పొందాలని సూచించారు.టీవీ ఛానళ్లు, కేబుల్ నెట్‌వర్క్‌లు, రేడియో, సినిమా హాళ్లు, బహిరంగ ఆడియో విజువల్ ప్రదర్శనలు, వాహనాలపై ఎల్ఈడీ స్క్రీన్లు, బల్క్ ఎస్ఎంఎస్‌లు, వాయిస్ మెసేజ్‌లు, సోషల్ మీడియా తదితర మాధ్యమాల ద్వారా ప్రసారం చేసే రాజకీయ ప్రకటనలకు సంబంధిత ఎంసీఎంసీ నుంచి ముందస్తు ధ్రువీకరణ పొందాలి. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు నిర్దేశిత గడువులోగా దరఖాస్తులు సమర్పించి అనుమతులు పొందాలని జిల్లా కలెక్టర్ సూచించారు.ఎన్నికల సమయంలో వార్తాపత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియా, డిజిటల్, సోషల్ మీడియా ప్రచారాలను నిరంతరం పర్యవేక్షిస్తూ, వార్తల రూపంలో ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను గుర్తించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పెయిడ్ న్యూస్‌గా నిర్ధారణ అయిన సందర్భాల్లో ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత అభ్యర్థి ఎన్నికల వ్యయంలో ఆ ఖర్చును చేర్చేందుకు చర్యలు తీసుకుంటారు.ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు విరుద్ధంగా రాజకీయ ప్రకటనలు ప్రసారం చేసినా, ప్రచురించినా నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, మీడియా సంస్థలు ఎన్నికల నియమావళిని, ఎంసీఎంసీ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## అమ్మవారి భక్తులకు అన్నసమారాధన



పాడేరు,అక్టోబర్25,ప్రభాతవార్త;

శ్రీశ్రీశ్రీ మోదకొండమ్మ వారి సన్నిధిలో ఆలయ కమిటీ చైర్మన్,పాడేరు శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు ఆదేశాల మేరకు ఆదివారం హుకుంపేట వాస్తవ్యులు బొడ్డేటి శ్రీను రాజేశ్వరి దంపతుల కుమారుడు బొడ్డేటి షణ్ముఖ్ నామకరణం సందర్భంగా వారి ఆర్థిక సహాయంతో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమానికి వంజంగి కాంతమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటి బాబు నాయుడు, ఆలయ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ బోనంగి వెంకటరమణ ,కిల్లు రాధాకృష్ణం నాయుడు, గబలంగి శంకర్ రావు, పలాసి రమణమ్మ, లకే రత్నబాయి, దేవుడు, జంపరంగి సత్తిబాబు ఏ.సత్యనారాయణ పాల్గొన్నారు.

## పారా లీగల్ వాలంటీర్లకు దరఖాస్తు ఆహ్వానం

పాడేరు,అక్టోబర్25,ప్రభాతవార్త;

విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు జీ.శ్రీనివాస్ ఉత్తర్వుల మేరకు జిల్లాలో పాడేరు, అరకు ప్రాంత ప్రజలకు న్యాయపరమైన సలహాలు, సహాయం అందించడంలో భాగంగా పారా లీగల్ వాలంటీర్లుగా పని చేయడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు, పాడేరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, ఏ. రాము శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు..ఈనెల 30 లోగా యువతీ, యువకులు. పాడేరు కోర్టులోని సంస్థ కార్యాలయానికి అందజేయాల్సి ఉంటుందన్నారు. కనీస విద్యార్హత పదో తరగతి, వివిధ సేవా సంస్థల్లో పని చేసేవారికి ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు.అభ్యర్థులు దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, విద్యార్హత, పాస్ పోర్టు సైజు ఫొటోలు జతచేయాలన్నారు. ఎలాంటి జీతం, పారితోషికం ఉండదని, శిక్షణ అనంతరం ఏడాదిపాటు వాలంటీర్లుగా కొనసాగవచ్చన్నారు.

## జిల్లా, మండల స్థాయిల్లో 24/7 కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలి

పాడేరు,అక్టోబర్25,ప్రభాతవార్త;

రానున్న తీవ్ర తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, జిల్లా,మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ టి. నిశాంతి జిల్లా అధికారులను ఆదేశించారు.జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేయడంతో పాటు, జిల్లాలోని అన్ని మండలాల్లోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఆమె స్పష్టం చేశారు. ఈ కంట్రోల్ రూమ్‌లు 24 గంటల పాటు, వారంలో ఏడు రోజులు (24/7) నిరంతరాయంగా పనిచేయాలని ఆదేశించారు. షిఫ్టుల వారీగా సిబ్బందిని నియమించి, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు, అత్యవసర సమాచారాన్ని వెంటనే సంబంధిత అధికారులకు చేరవేసి, తక్షణ చర్యలు తీసుకునేలా సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

**కలెక్టరేట్ కంట్రోల్ రూమ్ వివరాలు**

ల్యాండ్‌లైన్ నంబర్: 08935-293448,అత్యవసర సంప్రదింపు నంబర్: 92818 56953 అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తుఫాను హెచ్చరికలు, వాతావరణ సమాచారం, జిల్లా యంత్రాంగం జారీ చేసే సూచనలను ఎప్పటికప్పుడు గమనించాలనీ కలెక్టర్ నిశాంతి సూచించారు.

## సెలవు రోజున జిల్లా పరిషత్ పాఠశాలలో పిండి వంటలు

### జిల్లా ఉన్నతవిద్యా శాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన సామాజిక కార్యకర్త సోమిరెడ్డి రాజు





ఎస్. రాయవరం, ప్రభాత వార్త :

ఎస్. రాయవరంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ వంటల పథకం ( మధ్యాహ్న భోజన పథకం) వంటమనిషి, ఆదివారం మధ్యానం హైస్కూల్ ల్లో మద్యాన్న బోజన పదకం వంట సామాన్లు, గ్యాస్ ఉపయోగించి బయట వ్యక్తులకు పిండి వంటలు వండి ఇవ్వడానికి ఒప్పుకొని వంటలు చేయడం పై సామాజిక కార్యకర్త సోమిరెడ్డి రాజు సామాజిక మాధ్యమాల ద్వారా బట్టబయలు చేశారు. దీనిపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎంఈఓ,ఎంపీడీవోకు ఫిర్యాదు చేశానని ఆయన తెలియజేశారు.దీనిపై జిల్లా ఉన్నత విద్యాశాఖ అధికారులకు కూడా ఫిర్యాదు చేస్తానని ఆయన అన్నారు. స్కూల్ కమిటి సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు విచారించి చర్యలు తీసుకోవాలని కోరుకున్నారు. ఇప్పటికే బత్తుల వరహాలమ్మ 76 సం. కూరెళ్ళ నూకరత్నం 56 సం. వంట వ్యక్తులు సుమారు 30 ఏళ్ళు కు పైగా వీరే వంటలు నిబంధనలకు విరుద్ధంగా చేస్తున్నందున మార్పు చేయాలని ఇప్పటికే పలు పిర్యాదులు ఉండగా ఆదివారం సెలవు రోజు బయటి వాళ్లకు పిండి వంటలు చేయడం కొసమెరుపని సోమిరెడ్డిరాజు అన్నారు.

## తుపాను ముందస్తు సన్నద్ధతపై సీఎం చంద్రబాబు సమీక్ష

### వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న హోంమంత్రి అనిత.. ప్రజల భద్రతకు ప్రాధాన్యం

నక్కపల్లి,అక్టోబర్ 25:



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం తుపానుగా బలపడే అవకాశం ఉన్న నేపథ్యంలో, తుపాను ప్రభావం, ముందస్తు సన్నద్ధత, ప్రజల భద్రతపై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన సమీక్షా సమావేశంలో హోంమంత్రి వంగలపూడి అనిత పాల్గొన్నారు. ఆదివారం నక్కపల్లిలోని తన క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆమె ఈ సమావేశంలో పాల్గొని, తుపాను ఎదుర్కొనేందుకు చేపట్టిన చర్యలపై చర్చించారు.ఈ సమావేశంలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం, సహాయక చర్యలను వేగవంతం చేయడం, వివిధ శాఖల మధ్య సమన్వయంతో పనిచేయడం వంటి కీలక అంశాలపై చర్చించారు. అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తంగా ఉంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. తుపాను ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు 10 ఎన్‌డీఆర్ఎఫ్, 11 ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలను సహాయక చర్యల కోసం సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు అందించడంతో పాటు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే త్వరితగతిన పునరుద్ధరించేందుకు అవసరమైన చర్యలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించడమే లక్ష్యంగా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో పనిచేయాలని, తుపాను పరిస్థితులపై నిరంతరం అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం చర్యలు చేపట్టింది. సమీక్షా సమావే శంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బీసీ జనార్దన్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, డీజీపీ హరీష్ గుప్తా, వివిధ జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల వేళ అక్రమ మద్యంపై ఎక్సైజ్ నిఘా!

### ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, లాడ్జిల్లో ఆకస్మిక తనిఖీలు

### సారా, బెల్ట్ షాపులపై ప్రత్యేక దృష్టి

### అక్రమ మద్యం సమాచారం కోసం టోల్‌ఫ్రీ నంబరు 14405





(పాయకరావుపేట, ప్రభాతవార్త):

ఎన్నికల నేపథ్యంలో అక్రమ మద్యం రవాణాను అరికట్టేందుకు ఎక్సైజ్ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో భాగంగా అనకాపల్లి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశాల మేరకు పాయకరావుపేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. స్టేషన్ పరిధిలోని ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలు, లాడ్జిలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బస్సుల్లో ప్రయాణికుల లగేజీని క్షుణ్ణంగా పరిశీలించారు. ఎన్నికల సమయంలో అక్రమ మద్యం తరలింపు, సారా తయారీ, విక్రయాలు, బెల్ట్ షాపుల కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు. అక్రమ మద్యం రవాణా, విక్రయాలపై సమాచారం ఉన్నవారు టోల్‌ఫ్రీ నంబరు 14405కు ఫిర్యాదు చేయాలని ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీనివాస్ కోరారు.

## సరికొత్త డ్రోన్ పరిశీలించిన కలెక్టర్ నిశాంతి

పాడేరు,అక్టోబర్25,ప్రభాతవార్త;



అల్లూరి సీతారామరాజు జిల్లాలోని మారుమూల గిరిజన ప్రాంతాల్లో అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు సకాలంలో వైద్య సేవలు అందించేందుకు డ్రోన్ల ద్వారా మందుల సరఫరా చేపడుతున్న వినూత్న ప్రాజెక్టును ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ప్రశంసించారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలు కూడా తమ అవసరాలకు అనుగుణంగా ఈ ప్రాజెక్టును అమలు చేసుకోవాలని కలెక్టర్ల సమావేశంలో సూచించారు.ఈ నేపథ్యంలో జిల్లాలో డ్రోన్ల ద్వారా మందుల సరఫరా వ్యవస్థను మరింత ఆధునికీకరించి, సమర్థవం తంగా అమలు చేయాలనే లక్ష్యంతో అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ సరికొత్త డ్రోన్‌ను పరిశీలించారు. మారుమూల ప్రాంతాలకు అత్యవసర మందులను వేగంగా చేరవేసేందుకు నూతన డ్రోన్ పనితీరును, దాని వినియోగ అవకాశాలను సమీక్షించారు. కార్యక్రమాన్ని అల్లూరి సీతారామరాజు జిల్లాకు ఎన్నికల పరిశీలకులుగా విచ్చేసిన ఆర్. కూర్మనాథ్ కూడా పరిశీలించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రియాజ్ బేగ్‌తో పాటు ఇతర వైద్య అధికారులు పాల్గొన్నారు.

## డుంబ్రిగుడ, అరకువ్యాలీ మండలాల్లో పోలింగ్ కేంద్రాలు తనిఖీ

### పాల్గొన్న జిల్లా ఎన్నికల పరిశీలకుడు రోణంకి కూర్మనాథ్



అరకులోయ,అక్టోబర్25,ప్రభాతవార్త:

అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహ ణకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్ ఆదివారం డుంబ్రిగూడ, అరకువ్యాలీ మండలాల్లో విస్తృతంగా తనిఖీ చేశారు. వివిధ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించి అక్కడ అందుబాటులో ఉన్న మౌలిక వసతులు, ఓటర్లకు కల్పించాల్సిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా, సజావుగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలను ముందస్తుగా చేపట్టాలని సంబంధిత అధికారులకు అయన సూచించారు.

**డుంబ్రిగూడ మండలంలో పోలింగ్ కేంద్రాల తనిఖీ**

డుంబ్రిగూడ మండలంలోని దేముదు వలస గ్రామంలో ప్రభుత్వ గిరిజన సంక్షేమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు నంబర్లు 1, 2, 3, 4లను జిల్లా ఎన్నికల పరిశీలకులు సందర్శించారు. అనంతరం సాగర గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలు నంబర్లు 10, 11లను, కిల్లోగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం నంబర్ 12ను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు అవసరమైన మౌలిక వసతులు, విద్యుత్ సౌకర్యం, ఇతర ఏర్పాట్ల స్థితిగతులను పరిశీలించి, లోటుపాట్లు ఉంటే వెంటనే సరిచేయాలని అధికారులకు సూచించారు.

**అరకువ్యాలీ మండలంలో విస్తృతంగా తనిఖీలు**

అరకువ్యాలీ మండలంలో పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల పరిశీలకులు తనిఖీ చేశారు.కంఠబంసుగూడ గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు నంబర్లు 39, 40, 41, 42, 43, 45లను సందర్శించారు. కొత్త భల్లుగూడ గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలు నంబర్లు 32, 33, 34లను పరిశీలించారు. అలాగే గన్నెల గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలు నంబర్లు 6, 7, 8లను, లోతేరు గ్రామంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో ఉన్న పోలింగ్ కేంద్రాలు నంబర్లు 1, 2, 3లను తనిఖీ చేశారు.ఇరగాయి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, స్వర్ణ ఇరగాయి కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను కూడా సందర్శించి ఎన్నికల నిర్వహణకు సంబంధించి చేపట్టాల్సిన ఏర్పాట్లపై అధికారులతో చర్చించారు.

**పోలింగ్ కేంద్రాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించాలి**

తనిఖీల సందర్భంగా జిల్లా ఎన్నికల పరిశీలకులు రోణంకి కూర్మనాథ్, అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో అవసరమైన మౌలిక వసతులను త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. దివ్యాంగులు, వృద్ధ ఓటర్లు సులభంగా పోలింగ్ కేంద్రాల్లోకి ప్రవేశించేందుకు అవసరమైన చోట ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని సూచించారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో సంబంధిత బూత్ లెవల్ అధికారి (బీఎల్వో) పేరుతో పాటు ఫోన్ నంబర్‌ను స్పష్టంగా కనిపించే విధంగా ప్రదర్శించాలని అయన తెలిపారు.పోలింగ్ కేంద్రాల్లో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, లైట్లు, ఫ్యాన్లు లేని చోట వెంటనే ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు ముందుగానే సిద్ధం చేయాలని స్పష్టంచేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో భద్ర తను పటిష్టం చేయాలిసమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అక్కడ భద్రతా ఏర్పాట్లను మరింత పటిష్టం చేయాలని జిల్లా ఎన్నికల పరిశీలకులు సూచించారు. అవసరమైన చోట సీసీటీవీ కెమెరాలను త్వరితగతిన ఏర్పాటు చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో అరకువ్యాలీ మండల రిటర్నింగ్ అధికారి ఎం. శ్రీధర్, జిల్లా సర్వే, భూ రికార్డుల అధికారి కె. ఈశ్వర దొర, అరకువ్యాలీ మండల రెవెన్యూ అధికారి రాజా శ్రీధర్, అరకు వ్యాలీ మండల ఎంపీడీవో వీసం ప్రసాద్, డుంబ్రిగుడ ఎంపీడీవో, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## 109వ డివిజన్‌లో వైసీపీ నుంచి జనసేనలోకి 200 మంది కార్యకర్తలు చేరిక



అనకాపల్లి, అక్టోబర్ 25, (ప్రభాతవార్త)

స్థానిక జీవీఎంసీ ఎన్నికల నేపథ్యంలో అనకాపల్లి 109వ డివిజన్ రామనాయుడు కాలనీకి చెందిన సుమారు 200 మంది వైసీపీ కార్యకర్తలు ప్రముఖ వైద్యులు, మాజీ వైసీపీ నాయకుడు బొడ్డెడ లక్ష్మీనర సింహ ఆధ్వర్యంలో ఆదివారం జనసేన పార్టీలో చేరారు. అనకాపల్లి జనసేన పార్టీ ఇన్‌చార్జి భీమరశెట్టి రామ్కీ సమక్షంలో, సినీ నటుడు హైపర్ ఆది చేతుల మీదుగా వీరు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా రామ్కీ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలతో పాటు, అనకాపల్లి అభివృద్ధికి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ చేస్తున్న కృషికి ఆకర్షితులై పలువురు జనసేనలో చేరుతున్నారని తెలిపారు.సినీ నటుడు హైపర్ ఆది మాట్లాడుతూ, 2024 ఎన్నికల సమయంలో పిఠాపురం తర్వాత తాను ప్రచారం చేసిన అనకాపల్లి నియోజకవర్గంలో కొణతాల రామకృష్ణ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి గురించి ప్రజలు ప్రస్తావిస్తున్నారని అన్నారు. రాష్ట్రంతో పాటు అనకాపల్లి అభివృద్ధి చెందేందుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషిని ప్రజలు గుర్తిస్తున్నారని తెలిపారు. బొడ్డెడ లక్ష్మీనరసింహ మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ విధానాలపై విమర్శలు చేశారు. కొణతాల రామకృష్ణ నాయకత్వంలో, జనసేన పార్టీ ఇన్‌చార్జి రామ్కీ సారథ్యంలో అనకాపల్లిలో జనసేన, కూటమి బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. రానున్న జీవీఎంసీ ఎన్నికల్లో 109 డివిజన్‌లో పోటీ చేస్తున్న టీడీపీ, బీజేపీ బలపరిచిన జనసేన అభ్యర్థి బుద్ధ జ్యోతి శ్రీనివాస్ కు మద్దతుగా పనిచేస్తానని తెలిపారు. నూకాంబిక అమ్మవారి దేవస్థానం మాజీ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, 109వ డివిజన్ జనసేన నాయకుడు కాండ్రేగుల శ్రీరామ్, రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్ విల్లూరి హరికృష్ణతో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టాటా మ్యాజిక్ బీభత్సం.. ఒకరి మృతి.!

### ముందు స్కూటీ, ఆపై ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న వైనం

### దంపతులకు స్వల్ప గాయాలు.. కాంట్రాక్టు కార్మికుడి దుర్మరణం



(నక్కపల్లి, ప్రభాతవార్త):

మండలంలోని ఉపమాక శివారు సారిపల్లి వారి పాలెం జాతీయ రహదారిపై టాటా మ్యాజిక్ వాహనం వరుసగా రెండు ద్విచక్రవాహనాలను ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, దంపతులకు స్వల్ప గాయాలయ్యాయి. నక్కపల్లి సీఐ జె.మురళి తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం ఉదయం 7.20 గంటల సమయంలో నక్కపల్లి మండలం సారెపల్లివారిపాలెం జంక్షన్ సమీపంలో టాటా మ్యాజిక్ వాహనం (ఏపీ 39 యూవై 3086) తొలుత టీవీఎస్ జూపిటర్ స్కూటీని, అనంతరం మోటార్‌సైకిల్‌ను (ఏపీ 39 ఎల్‌బీ 9555) ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న నక్కపల్లికి చెందిన బూర్లే రాజేష్, ఆయన భార్యకు స్వల్ప రక్తగాయాలయ్యాయి. మోటార్‌సైకిల్‌పై ప్రయాణిస్తున్న ఎస్.రాయవరం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన కాంట్రాక్టు కార్మికుడు యెల్లా శ్రీరామచంద్రమూర్తి (53) తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే ఆయనను నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు కుమారస్వామి కుమారుడు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.




## తుపాను హెచ్చరికల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి

### అధికార యంత్రాంగానికి హోంమంత్రి అనిత కీలక ఆదేశాలు

నక్కపల్లి,అక్టోబర్ 25, ప్రభాతవార్త:



బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం అతి తీవ్ర తుపానుగా బలపడే అవకాశం ఉండటంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. తుపాను ప్రభావంతో సోమవా 0తంతంతంతరం నుంచి విస్తారంగా వర్షాలు, మంగళ, బుధవారాల్లో కోస్తాంధ్ర జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే సూచనలు ఉండటంతో హోంమంత్రి వంగలపూడి అనిత అధికార యంత్రాంగానికి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజల ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించేందుకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.బుధవారం బాపట్ల-విశాఖపట్నం తీరాల మధ్య తుపాను తీరం దాటే అవకాశం ఉందని, ఆ సమయంలో గంటకు 115 నుంచి 125 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే ప్రమాదం ఉందని తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, క్షేత్రస్థాయి అధికారులు అత్యంత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రమాదకరంగా ఉన్న హోర్డింగులను వెంటనే తొలగించాలని, అవసరమైతే తీర ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

**సహాయక బృందాలను సిద్ధంగా ఉంచాలి**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా జాతీయ విపత్తు స్పందన దళం ఎన్డీఆర్ఎఫ్,ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచాలని హోంమంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్‌ల ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు**

తుపాను హెచ్చరికల నేపథ్యంలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదని హోంమంత్రి సూచించారు. బీచ్‌లలోకి పర్యాటకుల ప్రవేశాన్ని నిషేధించాలని అధికారులను ఆదేశించారు. సముద్రంలో భారీ అలలు ఎగసిపడే ప్రాంతాల్లో సెల్ఫీలు తీసుకోవడం, ఇతర ప్రమాదకర కార్యకలాపాలకు పాల్పడటం వంటివి చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

**వదంతులను నమ్మొద్దు.. అధికారిక హెచ్చరికలను పాటించాలి**

తుపాను ప్రభావం దృష్ట్యా రైతులు, ప్రజలు తమ పనుల్లో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని హోంమంత్రి అనిత కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే వదంతులను నమ్మవద్దని, వాటిని ఇతరులకు పంపవద్దని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ, రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) జారీ చేసే అధికారిక హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## అర్నాబ్ తుఫాన్.. అప్రమత్తత అవసరం

బుచ్చయ్యపేట, అక్టోబర్ 25, ప్రభాతవార్త :

అర్నాబ్ తుఫాన్ ప్రభావంతో అనకాపల్లి జిల్లాలో నేటి నుంచి ఈ నెల 29వ తేదీ వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించినట్లు బుచ్చయ్యపేట తహసీల్దార్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పనులు ఉంటే తప్ప బయటకు రావద్దని, శిథిలావస్థలో ఉన్న ఇళ్లలో నివాసం ఉండవద్దని హెచ్చరించారు.ప్రజలకు ఏవైనా సమస్యలు ఎదురైనా, అత్యవసర సహాయం అవసరమైనా బుచ్చయ్యపేట తహసీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని కోరారు.కంట్రోల్ రూమ్ నంబర్: 08934-247857

## 9 మంది ఎంపీటీసీ నామినేషన్లు ఉపసంహరణ



ఎస్. రాయవరం, ప్రభాతవార్త :

మండలంలో ఆదివారం ఎంపీటీసీ నామినేషన్ ఉపసంహరణ ప్రక్రియ ముగిసింది. మొత్తం 9 మంది అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారని రిటర్నింగ్ అధికారి కె.మనోరమ తెలిపారు. ఉపసంహరించుకున్న అభ్యర్థుల వివరాలు గెడ్డపాలెం సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి వడ్లమూరి కుమారి, చినగుమ్ములూరు సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి మైలారు లక్ష్మి, గుడివాడ సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి చేకూరి అనూష, డి.హెచ్.అగ్రహారం సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థులు చొప్ప సీత , గజ్జల గణేష్, ఎస్.రాయవరం-1 సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి కొణతాల ఉమాదేవి, గెడ్డపాలెం సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి కాకర సరోజ, పెదఉప్పలం సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి కుచర్లపాటి కృష్ణ చైతన్య, ఒమ్మవరం సెగ్మెంట్ నుండి టీడీపీ అభ్యర్థి మాదాబత్తుల కొండమ్మ తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.మీనా కుమారి, తహసీల్దార్ జె.రమేష్ బాబు, డిప్యూటీ ఎంపీడీఓ బంగారు సత్యనారాయణ, ఏ.ఓ కె. రమేష్ బాబు పాల్గొన్నారు.

### అత్యాధునిక వైద్యసేవలకు

## సింధు హాస్పిటల్స్ కృషి అభినందనీయం

### 'మీట్ అండ్ గ్రీట్-ఓపెన్ హౌస్' కార్యక్రమంలో 'గంటా రవితేజ'



(నక్కపల్లి, ప్రభాతవార్త )

ప్రజలకు అత్యాధునిక క్యాన్సర్ వైద్య సేవలు అందించేందుకు సింధు హాస్పిటల్స్ చేస్తున్న కృషి అభినందనీయమని గంటా రవితేజ పేర్కొన్నారు. భారతదేశం లోనే అతిపెద్ద క్యాన్సర్ ఆసుపత్రిగా రూపుదిద్దుకోనున్న సింధు హాస్పిటల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'మీట్ అండ్ గ్రీట్--ఓపెన్ హౌస్' కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్య సేవల విస్తరణకు సంస్థ చేస్తున్న ప్రయత్నాలను ప్రశంసించారు. కార్యక్రమానికి తనను ఆహ్వానించిన రాజ్యసభ సభ్యుడు, హెటెరో గ్రూప్, సింధు హాస్పిటల్స్ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ బండి పార్థసారథి రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. క్యాన్సర్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న సింధు హాస్పిటల్స్ బృందానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## తుఫాన్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

### ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు 27 నుంచి 29 వరకు సెలవులు

అనకాపల్లి, అక్టోబర్ 25 ,(ప్రభాతవార్త):



రాబోయే మూడు రోజుల్లో అర్నాబ్ తుఫాను ప్రభావం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచించారు. అక్టోబర్ 26 నుంచి తుఫాను ప్రభావంతో భారీ వర్షాలు, బలమైన గాలులు సంభవించే అవకాశం ఉన్నందున ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం మధ్యాహ్నం వివిధ శాఖల జిల్లా అధికారులతో వెబ్ఎక్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించి, తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. మండలాల పరిధిలోని లోతట్టు ప్రాంతాలు, తీర ప్రాంతాల్లో నివసించే ప్రజలను అక్టోబర్ 26వ తేదీ సాయంత్రంలోగా గుర్తించి, అవసరమైన చోట్ల సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ ఆదేశించారు. తరలించిన ప్రజలకు తాగునీరు, భోజనం, అవసరమైన వసతులు కల్పించాలన్నారు. కిడ్నీ వ్యాధిగ్రస్తులు సహా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి అవసరమైన మందులు ముందుగానే అందుబాటులో ఉంచాలని సూచించారు.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని, సహాయక శిబిరాల్లో తగిన మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలని, వదంతులను నమ్మవద్దని సూచించారు.

**పాఠశాలలకు మూడు రోజులు సెలవులు**

తుఫాను ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు అక్టోబర్ 27 నుంచి 29వ తేదీ వరకు మూడు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ తెలిపారు. వసతి గృహాల్లోని విద్యార్థులకు వేడి తాగునీరు, నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాను సమయంలో విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, హాస్టళ్లలో అవసరమైన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు నిరంతరం పనిచేయాలి**

తుఫాను సమయంలో మొబైల్ ఫోన్ టవర్లు నిరంతరం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే ప్రత్యామ్నాయంగా జనరేటర్లను సిద్ధంగా ఉంచాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర సేవలకు విద్యుత్, సమాచార వ్యవస్థలు అందుబాటులో ఉండేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు.అక్టోబర్ 26వ తేదీ నుంచి కలెక్టరేట్‌లో 24 గంటల పాటు కంట్రోల్ రూమ్ పనిచేసేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. డివిజన్ స్థాయిలో ఆర్డీవో కార్యాలయాల్లో, మండల స్థాయిలో మండల కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర సమాచారం అందిన వెంటనే స్పందించేలా సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు.జిల్లాలోని అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ, ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ విజయ కృష్ణన్ స్పష్టం చేశారు. వెబ్ఎక్స్ సమీక్ష సమావేశంలో జిల్లాకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

## రెండు డిఏలు, క్వాంటమ్ పెన్షన్ ఇచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు

### ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తమరాన త్రినాథ్




అనకాపల్లి, అక్టోబర్ 25, (ప్రభాత వార్త):

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షన్ దారులకు ప్రభుత్వం రెండు డిఏలు క్వాంటమ్ పెన్షన్ పునరుద్ధరణ, పిఆర్సి కమిటీని నియమించడం హర్షనీయమని, ఇందుకు ప్రభుత్వానికి ఉద్యమం తెలియజేస్తున్నామని ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు తమరాన త్రినాథ్ పేర్కొన్నారు. అనకాపల్లి ఏపీటీఎఫ్ కొలపర్తి అప్పారావు ఉపాధ్యాయ సంఘ భవనంలో ఆదివారం జరిగిన ఏపిటిఎఫ్ ఉపాధ్యాయ సంఘం జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం ఇంటీరియర్ రిలీఫ్ (ఐ ఆర్) ను కూడా వెంటనే ప్రకటించాలని ఆయన కోరారు. ఎన్నికల విధుల్లో అందరూ తలమునకలై ఉన్నందున ఈ ఎస్ఆర్ నమోదు గడువును మరో రెండు నెలల పాటు పొడిగించాలని కోరారు. పదవీ విరమణ చెందిన ఉపాధ్యాయులకు ఖజానా శాఖలో సమస్యలు లేకుండా చూడాలన్నారు. ఏ జిల్లాలో లేని విధంగా సోమవారం రెండో శిక్షణతో పాటు సుదూరంలో ఉన్న పాఠశాలలకు కూడా ఉపాధ్యాయుల తప్పనిసరిగా హాజరు అవ్వాలని కోరడం ఎలా సాధ్యపడుతుందని ఆయన ప్రశ్నించారు. అందుకు అవసరమైన ఏర్పాట్లు అధికారులు చేస్తే హాజరు కావడానికి ఉపాధ్యాయులంతా సిద్ధంగా ఉన్నారన్నారు. ఎన్నికల నిర్వహణలో పాల్గొనే సిబ్బందికి అవసరమైన అన్ని ఏర్పాట్లు, సదుపాయాలు కల్పించాలని ఆయన కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై శ్రీనివాసరావు ఎస్ దుర్గాప్రసాద్ గౌరవ అధ్యక్షులు ధర్మారావు, జిల్లా ఉపాధ్యక్షులు పి గణపతి, విజయలక్ష్మి, కొణతాల గణేష్, కిరీటి, మణికుమార్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులకు రాసిన లేఖను వారు విడుదల చేశారు.

## అడ్డురోడ్డు ఆర్డీవో కార్యాలయంలో కంట్రోల్ రూమ్



ఎస్. రాయవరం,ప్రభాత వార్త :

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అడ్డురోడ్డు రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ను ఏర్పాటు చేస్తూ రెవిన్యూ డివిజన్ అధికారి కె.వి.రామలక్ష్మి ఆదివారం అత్యవసర ఉత్తర్వులు జారీ చేశారు. అక్టోబర్ 26 నుండి 29 వరకు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అడ్డురోడ్డు ఆర్డీఓ కార్యాలయ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు.కంట్రోల్ రూం నెంబర్లు: అడ్డురోడ్డు ఆర్డీఓ కార్యాలయ కంట్రోల్ రూం నెంబర్: 08931-293606, అనకాపల్లి కలెక్టర్ కార్యాలయ కంట్రోల్ రూం నెంబర్: 08924-226599.

## అక్రమంగా తరలిస్తున్న 140 మద్యం బాటిళ్లు, స్కూటీ స్వాధీనం



రాంబిల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండలంలోని అప్పరాయుడుపాలెం జంక్షన్ వద్ద అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను రాంబిల్లి పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి మొత్తం 140 మద్యం బాటిళ్లతో పాటు, మద్యం తరలించడానికి ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం సాయంత్రం సుమారు 4.30 గంటల సమయంలో అప్పరాయు దుపాలెం జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా స్కూటీపై మద్యం బాటిళ్లను తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.తనిఖీల్లో 180 మిల్లీలీటర్ల పరిమాణం కలిగిన 116 మద్యం బాటిళ్లు, 24 బీర్ బాటిళ్లు మొత్తం 140 లభ్యమయ్యాయి. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ.21,040 ఉంటుందన్నారు.ఈ ఘటనకు సంబంధించి రాంబిల్లి ఎస్సై డి.నాగేంద్ర ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేశారు. అక్రమంగా మద్యం తరలించడానికి ఉపయోగించిన స్కూటీని కూడా సీజ్ చేసామన్నారు.ఈ సందర్భంగా అక్రమంగా మద్యం నిల్వ చేయడం, రవాణా చేయడం, విక్రయించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు.

## కొక్కిరాపల్లిలో గ్రామజ్యోతి యువత ఆధ్వర్యంలో శ్రమదానం

ఎలమంచిలి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:



మున్సిపాలిటీ పరిధిలోని 31వ వార్డు కొక్కిరాపల్లి గ్రామాభివృద్ధిలో భాగంగా గ్రామజ్యోతి యువత వినూత్న కార్యక్రమం చేపట్టింది. పర్యావరణ పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రత కోసం ప్రతి ఆదివారం ఉదయం రెండు గంటల పాటు శ్రమదానం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఆదివారం ఉదయం గ్రామ ప్రధాన మార్గం మధ్యలో ఉన్న చిన్నపోలమ్మ తల్లి ఆలయం నుంచి శివాలయం వరకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న పిచ్చి మొక్కలు, చెత్త ఇతర వ్యర్థాలను తొలగించారు. ఈ విధమైన శ్రమదానంతో ఆ ప్రాంతాన్ని పరిశుభ్రంగా ఉంచడంతో పాటు విష జీవులు సంచరించకుండా ఉంచేందుకు తగు చర్యలు చేపడుతున్నామని గ్రామజ్యోతి యువత తెలిపారు. గ్రామజ్యోతి యువతతో పాటు చిన్నారులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు.

## బియ్యం పేరుతో మార్కెట్లో బహిరంగ దోపిడీ!?

**- పేరుకే పెద్ద బ్రాండ్లు .. ధరలపై వ్యాపారుల ఇష్టారాజ్యం!**

**- సామాన్యుడికి భారంగా మారిన బియ్యం ధరలు**

**- రూ.2,250 పలుకుతున్న బియ్యం బస్తా.. నాణ్యతపై అనుమానాలు.!**

**- బ్రాండెడ్ ముసుగులో నకిలీ, కల్తీ బియ్యం విక్రయాల పైన పెద్ద ఎత్తున ఆరోపణలు**

**- రేషన్ దుకాణాల నుంచే మిల్లులకు పీడీఎస్ బియ్యం మళ్లింపు.?**

**-కార్డుదారుల వేలిముద్రలు.. చేతికి నగదు.. బియ్యం వ్యాపారుల చెంతకు!**

**- కోట్ల రూపాయల అక్రమ వ్యాపారం జరుగుతోందన్న ఆరోపణలు**

**- పౌరసరఫరాల శాఖ నిఘా ఏమైంది.?.. అధికారుల తీరుపై ప్రశ్నలు..**

(నక్కపల్లి/అడ్డురోడ్డు, ప్రభాతవార్త):



పేదవాడి కంచంలో అన్నం కూడా భారంగా మారుతున్న పరిస్థితులు రోజురోజుకి కంటికి కనిఏి స్తున్నాయి.! ఒకవైపు బ్రాండెడ్ బియ్యం పేరుతో ధరల మోత.. మరోవైపు రేషన్ బియ్యం అక్రమ మళ్లింపు ఆరోపణలు.. వీటి మధ్య సామాన్య వర్గాల ప్రజలు ,వినియోగదారుడు నలిగిపోతున్నాడు. మార్కెట్‌లో బియ్యం ధరలను వ్యాపారులు ఇష్టారాజ్యంగా నిర్ణయిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. లలిత, బెల్ వంటి ప్రముఖ బ్రాండ్ల బియ్యం బస్తా ధర రూ.2,250 వరకు పలుకుతున్నట్లు చెబుతున్నారు. ఇదే అదునుగా కొందరు వ్యా పారులు బ్రాండ్ల పేరుతో నాణ్యత లేని బియ్యాన్ని విక్రయిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మరో వైపు పేదలకు ఉచితంగా అందాల్సిన ప్రజాపంపిణీ వ్యవస్థ (పీడీఎస్) బియ్యం కొందరు మధ్యవర్తుల ద్వారా రైస్‌మిల్లులకు చేరుతోందన్న ఫిర్యాదులు పెద్ద ఎత్తున వినిపిస్తున్న నేపథ్యంలో ఆందోళన కలిగిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా.. సంబంధిత అధికారుల పర్యవేక్షణ ఎంతవరకు ఉందన్న ప్రశ్న అన్నిచోట్ల తలెత్తుతున్నాయి.

**బ్రాండ్ పేరు చెప్పి.. ధరల బాదుడు!?**

బియ్యం మార్కెట్‌లో బ్రాండ్ పేరే ధర నిర్ణయానికి ప్రధాన ఆధారంగా మారిందనే విమర్శలున్నాయి.. లలిత, బెల్ వంటి పేరున్న బ్రాండ్లకు మార్కెట్‌లో ఆదరణ ఉండటంతో కొందరు వ్యాపారులు అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలు అన్నిచోట్ల పెద్దఎత్తున వినిపిస్తున్నాయి.బస్తా ధర రూ.2,250 వరకు చేరడంతో మధ్యతరగతి, సామాన్య కుటుంబాలపై ఆర్థికభారం పెరుగుతోంది. ఇదే సమయంలో ప్రముఖ బ్రాండ్లను పోలిన పేర్లు, ప్యాకింగ్‌లతో నకిలీ ఉత్పత్తులు మార్కెట్‌లోకి వస్తున్నాయనే అనుమానాలు వ్యక్తమ వుతున్నా యి. అసలు బియ్యం ఏది?నకిలీ ఏది?నాణ్యతకు భరోసా ఏమిటి?అనే సందేహాలు వినియోగదారులను వెంటాడుతున్నాయి. ఈ ఆరోపణలపై అధికారులు నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించాల్సిన అవసరం ఉంది.

**వేలిముద్ర వేస్తే చాలు.. బియ్యం మిల్లుకేనా?**

రేషన్ బియ్యం అక్రమ మళ్లింపుపై వినిపిస్తున్న ఆరోపణలు మరింత తీవ్రమైనవి. కొందరు రేషన్ డీలర్లు కార్డుదారుల నుంచి బియ్యాన్ని దుకాణాల వద్దే కొనుగోలు చేస్తున్నారనే విమర్శలున్నాయి. కార్డుదారుడు దుకాణానికి రావడం, వేలిముద్ర వేయడం, బియ్యం తీసుకున్నట్లు నమోదు కావడం.. ఆ తర్వాత కిలోకు కొంత నగదు చెల్లించి బియ్యాన్ని డీలర్లే తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలా సేకరించిన బి య్యాన్ని మధ్యవర్తుల ద్వారా రైస్‌మిల్లులకు తరలిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పేదల ఆహార భద్రత కోసం ప్రభుత్వం అందిస్తున్న బియ్యం వ్యాపార వస్తువుగా మారుతుండటం ఆందోళనకరం. ఈ వ్యవహారంలో డీలర్లు,మధ్యవర్తులు, మిల్లర్లపాత్రపై విచారణ జరగాలనే డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

**కోట్ల వ్యాపారం.. నిఘా ఉందా.. ప్రశ్న?**

అనకాపల్లి జిల్లాలో పీడీఎస్ బియ్యం అక్రమ కొనుగోళ్లు, విక్రయాల ద్వారా కోట్ల రూపాయల వ్యాపారం సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అక్రమంగా మళ్లుతున్న బియ్యం పరిమాణం, లావాదేవీల విలువపై అధికారిక నిర్ధారణ అవసరం. రేషన్ దుకాణాల నుంచి మిల్లుల వరకు బియ్యం రవాణా జరుగుతున్నట్లు వస్తున్న ఆరోపణలపై పౌరసరఫరాల శాఖ ఏ మేరకు తనిఖీలు నిర్వహిస్తోందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొందరు అధికారుల అండదండలతోనే ఈ వ్యవహారం కొనసాగుతోందనే విమర్శలూ ఉన్నాయి. ఈ ఆరోపణల్లో వాస్తవాలను నిగ్గుతేల్చి, బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**బియ్యం నుంచి నూనె వరకు.. ధరల మంట!**

బియ్యంతోనే నిత్యావసరాల భారం ఆగడం లేదు. వంటనూనెల ధరలు సైతం కుటుంబ బడ్జెట్‌పై ప్రభావం చూపుతున్నాయి. బియ్యం, నూనెతో పాటు ఇతర నిత్యావసరాల కొనుగోలుకే ఆదాయంలో అధిక భాగం వెచ్చించాల్సి వస్తోందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల నియంత్రణ, నాణ్యతా ప్రమాణాల అమలుపై అధికారులు ప్రత్యేక దృష్టిసారించాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**పేదల బియ్యంతో వ్యాపారమా?.. చర్యలేవీ?**

ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందించే బియ్యం పేద కుటుంబాల ఆహార అవసరాలు తీర్చేందుకే ఉద్దేశించింది. అలాంటి బియ్యం అక్రమంగా మార్కెట్‌కు మళ్లుతుంటే ప్రభుత్వ పథకం అసలు లక్ష్యమే దెబ్బతింటుంది. రేషన్ దుకాణాల్లో పంపిణీ రికార్డులు, కార్డుదారుల వేలిముద్రల నమోదు, బియ్యం నిల్వలు, రైస్‌మిల్లుల కొనుగోలు వివరాలను సమగ్రంగా పరిశీలిస్తే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. అక్రమ మళ్లింపుతో పాటు నకిలీ బ్రాండ్లు, అధిక ధరల విక్రయాలపైనా ప్రత్యేక తనిఖీలు చేపట్టాల్సిన అవసరం ఉంది.పేదల బియ్యం పక్కదారి పడుతోందన్న ఆరోపణలు.. బ్రాండ్ల పేరుతో వినియోగదారుల జేబులకు చిల్లు పడుతోందన్న విమర్శలు.. ఈ రెండింటిపైనా అధికారులు నిగ్గుతేల్చాల్సిన సమయం ఆసన్నమైంది. బియ్యం మార్కెట్‌లో అసలు ధర ఎంత? నాణ్యతకు భరోసా ఎవరు? రేషన్ బియ్యం మిల్లులకు చేరుతోందా? చేరితే దాని వెనుక ఎవరున్నారు? ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పాల్సిన బాధ్యత పౌరసరఫరాల శాఖ, జిల్లా యంత్రాంగంపైనే ఉంది. మరి దీనిపై మెగా పెడతారో ..లేక ధరలు నియంత్రణ చేస్తారో వేచి చూడాల్సిందే.!

## కొత్తపట్నంలో సిపిఎం ఆధ్వర్యంలో బహిరంగ సభ, ర్యాలీ



రాంబిల్లి, అక్టోబర్ 25, ప్రభాతవార్త:

మండలంలో కొత్తపట్నం గ్రామంలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ ర్యాలీ, బహిరంగ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీపీఎం రాష్ట్ర నాయకులు సిహెచ్. నర్సింగ్ రావు అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్. శంకర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కొత్తపట్నం గ్రామంలోని మత్స్యకారులు, నిర్వాసితుల సమస్యలపై సీపీఎం పార్టీ గతంలో అనేక పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం విశాఖపట్నం కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేపట్టి, నిర్వాసితుల సమస్యలు పరిష్కారాలు చేయడంలో సిపిఎం పార్టీ కీలక పాత్ర పోషించిందన్నారు.గ్రామం చుట్టూ నేవీ గోడలు నిర్మించడంతో ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని పరిస్థితులు ఉన్నాయని మత్స్యకారులు చేపల వేటకు వెళ్లేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక కంపెనీల్లో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం లేదని విమర్శించారు. కంపెనీల నుంచి సముద్రంలోకి విడుదలయ్యే వ్యర్థాల కారణంగా సముద్ర కాలుష్యం పెరిగి, మత్స్యకారులు చేపల వేట కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని అన్నారు.నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం గతంలో ఢిల్లీ వరకు వెళ్లి పోరాడిన చరిత్ర సీపీఎం పార్టీకి ఉందని వారు అన్నారు. ప్రస్తుతం తన వయస్సు 74 సంవత్సరాలైనా, నిర్వాసితుల సమస్యల పరిష్కారం కోసం మరోసారి కలెక్టరేట్‌కు పాదయాత్ర నిర్వహిస్తే అందులో పాల్గొనటానికి నేను సిద్ధమని అన్నారు. నిత్యవసర ధరలు రోజురోజుకీ విపరీతంగా పెరిగాయని వాటిని నియంత్రించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయని. ప్రజల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని పేర్కొంటూ, సీపీఎం అభ్యర్థులు గెలిస్తే ప్రజల సమస్యల పరిష్కారానికి మరింత బలం చేకూరుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఎం రాంబిల్లి మండల కార్యదర్శి జి. దేముడు నాయుడు, పార్టీ అభ్యర్థులు, నాయకులు రమణ, కాశీ, నాని, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

